# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 23-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- నేతాజీ సుభాష్ చంద్రబోస్ అజేయమైన ధైర్యం, సంకల్పం చిరస్మరణీయమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.
- వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం దేశం సమిష్టిగా పనిచేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు.
- గత దశాబ్ద కాలంలో భారత వస్త్ర రంగం అద్భుతమైన వృద్ధి సాధించిందని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు.
- రాయ్‌పూర్ వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య రెండవ టి20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్య ఉద్యమం కోసం ఇచ్చిన పిలుపు లక్షలాది మంది భారతీయులలో ధైర్యం, ఆత్మవిశ్వాసం, ఐక్యత, జాతీయవాద స్ఫూర్తిని మేల్కొలిపిందని రాష్ట్రపతి ముర్ము ఒక సామాజిక మాధ్యమం పోస్ట్‌లో పేర్కొన్నారు. సుభాష్ చంద్రబోస్ నాయకత్వం, అజేయ స్ఫూర్తి, అచంచల నిబద్ధత పరాక్రమ్ దివస్ సారాంశాన్ని ప్రతిబింబిస్తుందని ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేశానికి అందించిన అజేయమైన ధైర్యం, సంకల్పం, అసమానమైన సహకారాన్ని దేశ ప్రజలు ఈరోజు స్మరించుకుంటారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం దేశం సమిష్టిగా పనిచేస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కేరళలోని తిరువనంతపురంలో ఈరోజు జరిగిన ఒక బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్య సాధనలో నగరాలు కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. గత 11 సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం పట్టణ మౌలిక సదుపాయాలలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడుతోందన్నారు. ఆదాయపు పన్ను రేట్లలో సంస్కరణల ద్వారా కేరళలోని మధ్యతరగతి ప్రజలు కూడా అనేక మినహాయింపు ప్రయోజనాలను పొందారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అట్టడుగు స్థాయి వరకు బ్యాంకింగ్ సేవలను అందించడానికి అపారమైన ప్రయత్నాలు చేస్తోందని, బ్యాంకు రుణాలు సులభంగా పొందడానికి ఇది వారికి సహాయపడిందని ప్రధానమంత్రి పేర్కొంటూ..

(వాయిస్…29 సెకన్లు)

అలాగే.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు కేరళలోని తిరువనంతపురంలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. PM SVANidhi క్రెడిట్ కార్డును ప్రారంభించి, లక్ష మంది లబ్ధిదారులకు PM స్వనిధి రుణాలను పంపిణీ చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

గత దశాబ్ద కాలంలో భారత్‌లో వస్త్ర రంగం అద్భుతమైన వృద్ధిని సాధించిందని కేంద్ర జౌళి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. 74వ ఇండియా ఇంటర్నేషనల్ గార్మెంట్ ఫెయిర్-IIGF 2026ను న్యూఢిల్లీలో ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. వస్త్ర పరిశ్రమ విలువ 2014లో 8.4 లక్షల కోట్ల రూపాయల నుండి నేడు దాదాపు 16 లక్షల కోట్ల రూపాయలకు చేరుకుందని చెప్పారు. దేశీయ మార్కెట్ కూడా 6 లక్షల కోట్ల రూపాయల నుండి 13 లక్షల కోట్ల రూపాయలకు పెరిగిందన్నారు. కోవిడ్ మహమ్మారి తర్వాత దేశ ఎగుమతులు కూడా 25 శాతం కంటే ఎక్కువ పెరిగాయని అన్నారు. డిసెంబర్ 2025 నాటికి వస్త్ర పరిశ్రమ 29 వేల కోట్ల రూపాయలకు చేరుకుందని, ఉపాధి కల్పనకు ఈ రంగం అతిపెద్ద వేదికలలో ఒకటిగా మారిందని గిరిరాజ్ సింగ్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత రక్షణ రంగ సంస్థలతో సహకార అవకాశాలను అన్వేషించాలని రక్షణ రంగ ఉత్పత్తి విభాగం కార్యదర్శి సంజీవ్ కుమార్.. కెన్యా రక్షణ దళాలకు విజ్ఞప్తి చేశారు. కెన్యా పర్యటనలో భాగంగా నైరోబిలో జరిగిన 3వ భారత్ కెన్యా రక్షణ ప్రదర్శన, సదస్సులో ఆయన మాట్లాడుతూ.. భారతదేశ రక్షణ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ సామర్థ్యాలను వివరించారు. ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించుకునే దిశగా బలమైన సహకారం కోసం పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో భాగంగా సంజీవ్ కుమార్ రక్షణ పారిశ్రామిక భాగస్వామ్యాలు, శిక్షణ, రక్షణ ఎగుమతులు, దీర్ఘకాలిక సహకారం మొదలైన అంశాలపై కెన్యా రక్షణ మంత్రిత్వ శాఖ, రక్షణ దళాల సీనియర్ అధికారులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు.

= = = = = = = = = = = = = = = = = = =

గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో భారత సైన్యం ఆపరేషన్ సిందూర్‌పై ఒక శకటాన్ని ప్రదర్శించనుందని ఢిల్లీ సబ్ ఏరియా చీఫ్ ఆఫ్ స్టాఫ్.. మేజర్ జనరల్ నవరాజ్ ధిల్లాన్ తెలిపారు. ఈరోజు ఆయన న్యూఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ ప్రదర్శన దేశ విజయాన్ని, త్రివిధ దళాల ఐక్యతను సూచిస్తుందన్నారు. యుద్ధ ట్యాంకులు, క్షిపణి వ్యవస్థలు, డ్రోన్‌లు, సాయుధ వేదికలతో పాటు విన్యాసాలను ప్రదర్శించే బ్యాటిల్ అర్రే ఫార్మేషన్‌ను భారత సైన్యం తొలిసారిగా ప్రదర్శిస్తుందని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

గడచిన 11 సంవత్సరాలుగా ఎన్డీఏ ప్రభుత్వం తమిళనాడుకు వివిధ అభివృద్ధి పథకాలకు 11 లక్షల కోట్ల రూపాయలు కేటాయించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. తమిళనాడులోని మధురాంతకంలో ఈరోజు జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. తమిళనాడు ప్రజలు ప్రభుత్వ మార్పుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో రైలు ప్రాజెక్టులు 7 రెట్లు పెరిగాయని, 50 వేల కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేశామన్నారు. రాష్ట్రంలోని యువత, చిన్న వ్యాపారులకు 6 కోట్ల రూపాయల ముద్ర రుణాలు ఇచ్చామని, లబ్దిదారుల సంక్షేమం కోసం బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని, తద్వారా నిధులు వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చేరుతాయని ప్రధానమంత్రి వివరిస్తూ...

(వాయిస్…28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

Pro-Active Governance and Timely Implementation (ప్రగతి) 50వ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించడంతో ఒక కీలక మైలురాయిని సాధించింది. 2015లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించినప్పటి నుండి, PRAGATI.. ప్రధానమంత్రి ప్రత్యక్ష సమీక్ష ద్వారా కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్రజా ఫిర్యాదుల పర్యవేక్షణ, పరిష్కరించడం ద్వారా పాలనను మార్చింది. దశాబ్ద కాలంగా, PRAGATI నిర్ణయం తీసుకోవడాన్ని వేగవంతం చేయడంలోను, కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో జాప్యానికి కారణమయ్యే సమస్యలను పరిష్కరించడంలోను, అలాగే జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో సహాయపడింది. ఉత్తరప్రదేశ్‌లోని మౌ- ఘాజీపూర్ - తారిఘాట్ న్యూ బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్‌ను గురించి ఈరోజు తెలుసుకుందాం.

ఉత్తరప్రదేశ్‌లో 51 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న మౌ - ఘాజీపూర్ - తారిఘాట్ న్యూ బ్రాడ్ గేజ్ రైల్వే లైన్, ఒక పరివర్తనాత్మక రైలు మౌలిక సదుపాయాల చొరవను సూచిస్తుంది. దీనికి ఒక వెయ్యి 765 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. ఈ ప్రాజెక్ట్ అమలులో అనేక సవాళ్లను ఎదుర్కొంది. ఈ ప్రాజెక్టను ప్రధానమంత్రి 2018 సెప్టెంబర్

26న ప్రగతి వేదికలో సమగ్రంగా సమీక్షించారు. దీని ప్రాముఖ్యతను గుర్తించి, వ్యవస్థాగత అడ్డంకులను పరిష్కరించడానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయబడ్డాయి. దీంతో ఈ ప్రాజెక్ట్ 2024 మార్చి 6వ తేదీన 100 శాతం పూర్తయ్యి, ప్రారంభించబడింది. మౌ - ఘాజీపూర్ - తారిఘాట్ బ్రాడ్‌గేజ్ లైన్ ప్రారంభం తూర్పు ఉత్తరప్రదేశ్‌కు సుదూర సామాజిక-ఆర్థిక ప్రయోజనాలను అందించింది.

= = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (IICDEM) సమావేశాలు ఈరోజు ముగిశాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అనేక దేశాల ప్రతినిధి బృందాలతో ఈరోజు ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రపంచ ఎన్నికల అనుభవాలు, ఆవిష్కరణలపై విస్తృత స్థాయిలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ.. వివిధ దేశాల ఎన్నికల నిర్వహణ సంస్థ (EMB)లతో సహకరించడానికి, వారి సొంత చట్టాల ప్రకారం ఆయా దేశాలలో ECINET లాంటి సాంకేతిక వేదికలను అభివృద్ధి చేయడానికి భారత్ అంగీకారం తెలిపిందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = =

రాయ్‌పూర్ వేదికగా భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న రెండవ టి-20 క్రికెట్ మ్యాచ్ లో టాస్ గెలిచిన భారత్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. న్యూజిలాండ్ జట్టు 17 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =